వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 29: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ డిప్లొమా ఇన్ ఎర్లీ ఇంటర్వెన్షన్ పరీక్షలను వచ్చే నెల 8వ తేదీ నుంచి, ఎంబీఏ (ఈ వినింగ్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్) (ఈవినింగ్) రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను వచ్చే నెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

నేడు పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభ

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 29: ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) స్వర్ణోత్సవ సభను సోమవారం నిర్వహించనున్నట్టు పీడీఎస్‌యూ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల నుంచి ఉదయం 11 గంటల కు ఠాగూర్ ఆడిటోరియం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు చెప్పారు. అనంతరం ఠాగూర్ ఆడిటోరియంలో మధ్యాహ్నం 12 గంటలకు సభను నిర్వహిస్తామన్నారు. ముఖ్యఅతిథులుగా ముంబై హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీజీ కొల్సే పాటిల్, ప్రొఫెసర్ హరగోపాల్, ఆంధ్రజ్యోతి సంపాదకుడు కె.శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు సతీశ్ చందర్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పాల్గొని ప్రసంగిస్తారన్నారు.

పురస్కారాల ప్రదానం

ముషీరాబాద్: సరసిజ థియేటర్ ఫర్ విమెన్, లేఖిని రచయిత్రుల వేదిక ఆధ్వర్యంలో చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో ముగురమ్మలు-అమ్మమ్మలు ఆత్మీయ పురస్కారం ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం హాజరై పురస్కారం అందించారు. అలూరి విజయలక్ష్మి, ముక్తేవి భారతి, వంశీ రామరాజు, అత్తలూరి విజయలక్ష్మి, సర్వమంగళ గౌరి, వేదవతి, పీవీఎస్ కృష్ణకుమారి, ముళ్లపూడి శ్రీదేవి, అల్లూరి గౌరీలక్ష్మి, కె.లక్ష్మిరాఘవ, వీణ పాల్గొన్నారు.

అర్హులకు ఇండ్లు కేటాయించండి

- సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు విజ్ఞప్తి చేసిన జీవైఆర్ కాలనీవాసులు

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన జీవైఆర్ కాలనీవాసులు

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 29: జీవైఆర్ డబుల్ బెడ్‌రూం కాలనీలో నిరుపేదలకు ఇండ్లను కేటాయించాలని కాలనీవాసులు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి కోరారు. ఆదివారం మారెడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను కలిశారు. ప్రత్యేక చొరవ తీసుకొని తమకు రెండు పడక గదుల కాలనీ నిర్మించి, తమ జీవితాల్లో వెలుగులను నింపారని కాలనీ అధ్యక్షుడు మంతపురి వెంకట్‌బాబు అన్నారు. తమ బస్తీలో కొందరికి ఇండ్లు రాలేదని, వారు పడుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. పేదలకు తాను అండగా ఉంటానని, తప్పకుండా అర్హులందరికి న్యాయం చేస్తామని తలసాని వారికి హామీ ఇచ్చారు. కేసీఆర్ హయాంలో సనత్‌నగర్ నియోజకవర్గంలో అత్యధిక డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇచ్చామని ఆయన తెలిపారు. అనేక బస్తీలు అద్భుతమైన కాలనీలుగా రూపొందాయని అన్నారు. జీవైఆర్ కాలనీ నాయకులు బాల్‌రాజ్, రవి, జహంగీర్, సత్యనారాయణ, నర్సింగ్‌రావు, మనోజ్, దశరత్, అనిల్ పాల్గొన్నారు.

న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం

కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, సెప్టెంబర్ 29: తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, కామారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్ పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగపుత్రులు న్యాయవాద వృత్తిలో రాణించడం మంచి పరిణామం అన్నారు. ఐక్యంగా ఉంటూ అన్నిరంగాల్లో రాణించాలని ఆయన పిలుపునిచ్చారు. హైకోర్టు న్యాయవాది పాక సాయి సంతోష్, డాక్టర్ దేశబోయిన రఘు, భూపతి, పల్లికొండ అరవింద్, దేశబోయిన భాస్కర్ తదితరలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో అక్టోబర్ 3 నుంచి జరుగనున్న దసరా శర్నరాత్రోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆలయ ఈవో ఆహ్వానపత్రికను అందజేశారు. ఆదివారం ఎమ్మెల్యే తలసానిని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానపత్రికతో పాటు అమ్మవారి ప్రసాదాన్ని అందజేయగా, అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. కార్యక్రమంలో రాంగోపాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. – బేగంపేట్

జనహిత సేవా ట్రస్ట్‌కు ఎక్సెలెన్సీ అవార్డు

నర్సింహమూర్తికి ఎక్సెలెన్సీ-2024 అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 29: పద్మారావు నగర్‌కు చెందిన జనహిత సేవా ట్రస్ట్ అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఎక్సెలెన్సీ అవార్డు-2024 అవార్డు అందజేశారు. ఆదివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో పీఎం ప్రొడక్షన్స్ సంస్థ డైరెక్టర్ జె.శైలజ, జనహిత సంస్థ మేనేజింగ్ ట్రస్టీ సోమయాజుల నర్సింహ మూర్తిని శాలువాతో సన్మానించి, అవార్డు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా నర్సింహమూర్తి మాట్లాడుతూ 2013 నుంచి తమ సంస్థ గాంధీ దవాఖానలో నిరుపేదలకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని అన్నారు. రోగి సహాయకులకు షెల్టర్ హోమ్ నిర్వహణ, హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు, బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాల నిర్వహణ, యువతకు, మహిళలకు ఉపాధి శిక్షణ, దివ్యాంగులకు కృత్రిమ అవయవాల అందజేత, పేద విద్యార్థులకు ఉచిత బోధన తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వపాఠశాలకు జోయాలుక్కాస్ చేయూత



సిటీబ్యూరో, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): జోయాలుక్కాస్ సంస్థ బేగంపేట బ్రాంచ్ ఆధ్వర్యంలో సంస్థ 60వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాజ్‌భవన రోడ్‌లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ.1,43,445 విలువగలిగిన సామగ్రిని అందజేసింది. ఆంప్లిఫయర్, మైక్, స్పీకర్, సిస్టమ్స్‌లతో పాటు వివిధ రకాల క్రీడాసామగ్రిని అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్రపతి నిలయంలో కళా మహోత్సవ్

కళా మహోత్సవ్ వేడుకల్లో ఏర్పాటు చేసిన స్టాల్స్

బొల్లారం, సెప్టెంబర్ 29: బొల్లారం రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్ ప్రదర్శనకు మొదటి రోజు సందర్శకులను ఆకర్షించింది. దేశంలో ఈశాన్య రాష్ట్రాల సుసంపన్నమైన, వైవిధ్యభరితమైన సంస్కృతిని పురస్కరించుకొని కలర్స్ ఆఫ్ ది నార్త్ ఈస్ట్ అనే పేరుతో ఆకర్షణీయమైన నృత్య ప్రదర్శనతో ప్రారంభించినట్టు నిలయం అధికారి రజనీప్రియ వెల్లడించారు. 8 రాష్ట్రాల నుంచి సంప్రదాయ నృత్య రూపాలను, నృత్య కళాకారులు అలరించారు. హస్తకళలను వీక్షించడానికి ప్రజలు విచ్చేశారు. ప్రధానంగా తామర పట్టు నేయడం, కుండలు, బుట్టలు అల్లిక వంటి స్వదేశీ క్రాఫ్ట్స్ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలు అక్టోబర్ 6వరకు కొనసాగుతాయని రజనీప్రియ తెలిపారు.

విజయవంతంగా స్కాలర్‌షిప్ టెస్ట్

స్కాలర్‌షిప్ టెస్టును పరిశీలిస్తున్న అకాడమీ నిర్వాహకురాలు బాలలత

చిక్కడపల్లి, సెప్టెంబర్ 29: సివిల్స్ తమ లక్ష్యంగా పెట్టుకున్న గ్రామీణ ప్రాంత యువతను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ, టైలరో ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించారు. సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు బాలలత మాట్లాడుతూ ఈ టెస్టులో సుమారు 2500 మంది హాజరయ్యారని, టాప్ 10 విజేతలకు అకాడమీలో ఉచితంగా సివిల్స్ కోచింగ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. టాప్ 100 వచ్చిన వారికి ఉచితంగా సివిల్స్ మెటీరియల్స్‌ను అందిస్తామని తెలిపారు. ఆర్థిక స్తోమత లేని విద్యార్థులకు తమ లక్ష్యాన్ని చేరుకోడంలో తమవంతు వారికి ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆమె తెలిపారు.

ఉద్యోగ విరమణ

మూడున్నర దశాబ్దాల తన సర్వీస్‌లో దేవాలయాల అభివృద్ధికి, భక్తుల సేవ కోసం కృషిచేసిన వ్యక్తిగా శ్రీనివాస్‌రాజుకు ఎనలేని గుర్తింపు పొందారని వక్తలు పేర్కొన్నారు. సనత్‌నగర్ హనుమాన్ ఆలయ ఈవోగా పదవీ విరమణ చేస్తున్న శ్రీనివాస్‌రాజు సన్మాన కార్యక్రమం ఆదివారం ఆలయ ఆవరణలో జరిగింది. కాలనీ సంఘాల ప్రతినిధులు, సత్సంగ్ సభ్యులు ఈవోను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మిబాల్‌రెడ్డి, ఆలయ ప్రధానార్చకులు పరాశరం రవీంద్రాచార్యులు, దేవాదాయ శాఖ ఉద్యోగులు, అర్చక, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. తన విధి నిర్వహణలో సహకరించిన ప్రతిఒకరికి ఈవో శ్రీనివాస్‌రాజు ధన్యవాదాలు తెలిపారు. – అమీర్‌పేట్

బాలికలకు పోషకాహారం పంపిణీ

బాలికలకు పోషకాహారాన్ని పంపిణీ చేసిన డాక్టర్ స్వరూపారాణి

ముషీరాబాద్, సెప్టెంబర్ 29: ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్, నవభారత లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఒత్తిడితో గుండెపోటు అంశంపై ముషీరాబాద్ రెయిన్‌బో హోం అనాథశ్రమంలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ అడ్వకేట్ డాక్టర్ పి.స్వరూపారాణి మాట్లాడుతూ ఒత్తిడిని జయించి గుండెపోటు రాకుండా చూసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా బాలికలకు విటమిన్ ట్యాబెట్లు, పోషకాహారం, పుస్తకాలు అందజేయగా డాక్టర్ హిప్నో పద్మ కమలాకర్, ఎస్.గోపాలకృష్ణ, జి.కృష్ణవేణి, జ్యోతిరాజా, సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాల నిర్వహణకు కమిటీ

బతుకమ్మ కమిటీ ప్రతినిధులు

అమీర్‌పేట్, సెప్టెంబర్ 29: సనత్‌నగర్ జెక్‌కాలనీలో అక్టోబర్ 2 నుంచి 10వ తేదీ వరకు జరిగే బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నిర్వహణకు బతుకమ్మ ఉత్సవ కమిటీ ఏర్పడింది. కమిటీ అధ్యక్షురాలిగా చింతిరెడ్డి ప్రభ, ప్రధాన కార్యదర్శి దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణతో పాటు పూర్తిస్థాయి కార్యవర్గం నియామకమైంది. 9 రోజుల పాటు జరిగే వేడుకలు ఒక్కో వీధిలో ఒక్కో రోజు జరిగే విధంగా కార్యాచరణ రూపొందించామని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. అక్టోబర్ 2న వీధి నంబర్ 2లోని అనంతరెడ్డి బంగళా, 3న వైష్ణవి సన్‌రైజ్ అపార్ట్‌మెంట్స్, 4న వాసవి సెంట్రల్ కోర్ట్, 5న వాసవి ఇంద్రప్రస్థ, 6న వనమాల రెసిడెన్సీ, 8 ఐకాన్ అపార్ట్‌మెంట్స్, 10న హెచ్‌డీఎఫ్‌సీ చౌరస్తాలో జరిగే సద్దుల బతుకమ్మతో వేడుకలు ముగుస్తాయని తెలిపారు. సంప్రదాయ పద్ధతుల్లో పేర్చిన మొదటి ఐదు ఉత్తమ బతుకమ్మలను న్యాయనిర్ణేతలు గుర్తిస్తారని, వారికి బహుమతులు ఇస్తారని తెలిపారు.

అక్కినేని జీవన సాఫల్య పురస్కారాల ప్రదానం

పురస్కార గ్రహీతలతో రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

ముషీరాబాద్, సెప్టెంబర్ 29: శృతి లయ ఆర్ట్స్, సీల్‌వెల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విఖ్యాత నటుడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో వివిధ రంగాల ప్రముఖులకు అక్కినేని జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. సినీ సంగీత విభావరి పలువురి ఆకట్టుకుంది. ఆకాశవీధిలో అందాల జాబిలి శీర్షిక ప్రముఖ గాయకులచే సంగీత విభావరి రంజిపజేసింది. రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి పాల్గొని పలువురికి పురస్కారం అందించారు. కోలేటి దామోదర్‌గుప్త, వంశీ రామరాజు, మహ్మద్ రఫీ, సీల్‌వెల్ కార్పొరేషన్ ఎండీ బండారు సుబ్బారావు, పన్నాల బాల్‌రెడ్డి, భీంరెడ్డి, ఆమని తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఇన్‌స్పెక్టర్

చిక్కడపల్లి, సెప్టెంబర్ 29: ఏవీ కళాశాలలో ప్రెషర్స్ డే సంబురాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా దోమలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి హాజరై వేడుకలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకుడదని, డ్రగ్స్, గంజాయి, హెరాయిన్ లాంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మూడేండ్ల డిగ్రీ కష్టపడి చదివితే రాబోయే 30 సంవత్సరాలు భవిష్యత్తు సుందరంగా ఉంటుందన్నారు. గురువుల సూచనలు, సలహాలు తీసుకొని ఉన్నత విద్య వైపు అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజలింగం, కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

సంస్మరణ సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కె.నాగేశ్వర్

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 29: కమ్యూనిస్టు దిగ్గజం, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఉస్మానియా యూనివర్సిటీలో ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎస్.వీరయ్య, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాం షెఫర్డ్, డాక్టర్ ఆమంచి నాగేశ్వర్, డాక్టర్ కొండా నాగేశ్వర్‌రావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి.నాగరాజు, జిల్లా కార్యదర్శి అశోక్‌రెడ్డి, ఓయూ కార్యదర్శి రవి నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏచూరి అందించిన సేవలను కొనియాడారు.

బీఆర్ఎస్ నాయకుడిపై పోలీసుల దాడి


గాయపడిన బీఆర్ఎస్ నాయకుడు సత్యనారాయణ బాబు

ముషీరాబాద్, సెప్టెంబర్ 29: అకారణంగా బీఆర్ఎస్ నాయకుడిపై ముషీరాబాద్ పోలీసులు దాడి చేసి గాయపర్చారు. సంబంధిత వివరాలు.. ముషీరాబాద్ వినోబానగర్‌లో పోలీసులు శనివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అదేసమయంలో వినోబానగర్‌కు చెందిన బీఆర్ఎస్ నేత సత్యనారాయణ బాబు ఇంటి బయట ఉండగా పోలీసులు లోపలికి వెళ్లమన్నారు. అర్ధరాత్రి వరకు తెరిచి ఉన్న బార్‌ను ముందు బంద్ చేయించండి అంటూ బదులిచ్చాడు. మాకే ఎదురు చెప్తావా అంటూ ఏఎస్ఐ మోహన్‌రావు, మరో ఇద్దరు కానిస్టేబుల్స్ చితకబాదారు. తరువాత పోలీసు స్టేషన్ తీసువెళ్లి కొంతసేపటికి వదిలిపెట్టారు. గాయపడిన బాధితుడు గాంధీ ఆసుపత్రి వెళ్లి చూపించుకోగా చెయ్యి విరిగినట్టు ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. విషయం తెలిసిన బీఆర్ఎస్ నాయకులు శివముదిరాజ్, వై.శ్రీనివాస్ బాధితుడితో కలిసి ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆకారణంగా దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను మూసి వేయాలి

డంపింగ్‌యార్డ్‌ను మూసి వేయాలని డిమాండ్ చేస్తున్న బాధితులు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 29: నగరంలోని దమ్మాయిగూడలో ఉన్న జవహర్‌నగర్ డంపింగ్ యాడ్‌ను నగర నలుమూలలకు తరలించాలని డంపింగ్‌యార్డ్ సన్నాహక కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి నిర్ణయం తీసుకోకపోతే రాబోయే రోజుల్లో తమ ప్రాంతానికి చెత్తను తీసుకొచ్చే లారీలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. ఆదివారం ఇందిపార్క్ ధర్నాచౌక్ వద్ద డంపింగ్‌యార్డ్ నిరసన దీక్ష సన్నాహక కమిటీ ఆధ్వర్యంలో జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను శాశ్వతంగా మూసి వేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున్న ధర్నా నిర్వహించారు. కమిటీ కన్వీనర్లు గోగుల రామకృష్ణ, పద్మాచారి, మారెం సమ్మిరెడ్డి, సంజీవరెడ్డి, సందీప్ మాట్లాడారు. డంపింగ్ యార్డు ఏర్పాటు చేసిన నాటి నుంచి 15 ఏండ్లుగా స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మల్కాజిగిరి ఎంపీగా ఉన్న సమయంలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, వెంటనే డంపింగ్ యార్డు తరలించే విధంగా సీఎం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కార్ఖాన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 29: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఆదివారం కార్ఖాన లాలషా దర్గా ఆధ్వర్యంలో మెడికోవర్ ఆసుపత్రి బేగంపేట వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీ, కాలనీల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని అన్నారు. స్థానికంగా ఇలాంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం వల్ల పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో నాయకులు ఆశ్రఫ్, భాస్కర్, జమిల్, జావిద్, మజర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాపార్క్‌లో వరల్డ్ హార్ట్ డే వాక్

ఇందిపార్క్‌లో వరల్డ్ హార్ట్ డే వాక్‌లో పాల్గొన్న వాకర్స్

చిక్కడపల్లి, సెప్టెంబర్ 29: శరీరాన్ని నడిపించే ఇంజిన్ హృదయం అని ది కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా(సీఎఫ్ఐ) తెలంగాణ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ అమన్ సాల్వాన్ తెలిపారు. సీఎస్ఐ తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకొని ఆదివారం ఇందిరాపార్క్‌లో వరల్డ్ హార్డ్ డే వాక్‌ను నిర్వహించారు. వాక్‌ను అధ్యక్షుడు డాక్టర్ అమన్ సాల్వాన్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణ మోహన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన గుండె లేకుండా శరీరం సరైన రీతిలో పని చేయదన్నారు. ప్రతిఒక్కరూ తమ గుండె ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

బతుకమ్మ కోసం ఏర్పాట్లు చేయాలి

ఎమ్మెల్యే తలసానికి వినతిపత్రం అందజేస్తున్న నాగలక్ష్మి, వెంకటేశన్‌రాజు

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 29: తెలంగాణాలో ఘనంగా జరుపుకునే బతుకమ్మ ఉత్సవాల కోసం బస్తీల్లో ప్రభుత్వం తరపున ప్లాస్టిక్ పాండ్‌లను ఏర్పాట్లు చేయాలని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, నాగలక్ష్మి ఆదివారం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి కోరారు. మారెడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక పదేండ్లుగా, కేసీఆర్ సర్కారు ద్వారా బతుకమ్మ ఉత్సవాలను మహిళలు వైభవంగా జరుపుకున్నారని అన్నారు. ఆడపడుచులకు కానుకగా చక్కటి డిజైన్లతో చీరలను అందజేశారని గుర్తుచేశారు. హుస్సేన్‌సాగర్ వద్ద ప్రత్యేక ఘాట్‌ల నిర్మాణం, బస్తీల్లో ప్లాస్టిక్ పాండ్‌లను ఏర్పాటు చేసిన ఘనత గత ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడుతానని ఆయన అన్నారు.

శాంతిదీప్‌కాలనీలో మీట్ యువర్ మెంబర్

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 29: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ఐదో వార్డు శాంతిదీప్‌కాలనీలో ఆదివారం మీట్ యువర్ మెంబర్ కార్యక్రమాన్ని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కాలనీలో కొత్త నల్లాల ఏర్పాటు, సీసీరోడ్డు, తాగునీటి పైప్ లైన్, వీధి దీపాల ఏర్పాటు వంటి సమస్యలను ఆయన దృష్టికి కాలనీవాసులు తీసుకొచ్చారు. అనంతరం నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ మాట్లాడుతూ స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కరానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. దశలవారీగా సమస్యలను శాశ్వతంగా పరిష్కరించనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.